క్లుప్తంగా

సమ్మె నోటీస్ అందజేత

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్ దాసరి నాగేంద్రకు సమ్మె నోటీస్ అందించారు. ఈ నెల 6వ తేదీ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను, డిమాండ్లను పరిష్కరించేందుకు సమ్మెకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పల్లంటి రాజా, నూతి కృష్ణ, గడ్డం పోతయ్య ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



నగదు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో గత నెలలో పకీరయ్య కుటుంబం అగ్ని ప్రమాదానికి గురికాగా.. ఆ కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో మంగళవారం రూ.10,100 రూపాయల నగదు, 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందించారు. కార్యక్రమంలో క్లబ్ భద్రాచలం అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి భరత్, యోగి సూర్యనారాయణ, బాల నర్సారెడ్డి, భోగాల శ్రీనివాస్ రెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ములకలపల్లి: అర్హులైన వారందరికీ పోడు పట్టాలివ్వాలని రాచన్నగూడెం గ్రామస్తులు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పట్టా పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసిన స్థానికులు, కొందరికి మాత్రమే హక్కుపత్రాలు వచ్చాయని, మిగతా వారికి కూడా పట్టాలు మంజూరయ్యేలా చూడాలని వారు కోరారు. జగన్నాథపురంలో 12 మంది గిరిజనుల భూములు సర్వే చేసినా, పట్టాలు మంజూరు కాలేదని కోఆప్షన్ సభ్యుడు జబ్బార్, ఎంపీటీసీ సున్నం సునిత అన్నారు. పట్టా పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేకు విషయాన్ని విన్నద్దామని వెళుతుంటే పోలీసులు అడ్డుకున్నారని వాపోయారు. అర్హులకు న్యాయం చేయాలని వారు అభ్యర్థించారు.

గోశాలకు విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో గోవులకు గోగ్రాసం కోసం భద్రాచలం దేవస్థానం విశ్రాంత అర్చక ఉద్యోగులు రూ.25 వేలు విరాళంగా మంగళవారం దేవస్థానం ఈఓ రమాదేవికి అందించారు. కార్యక్రమంలో విశ్రాంత అర్చక ఉద్యోగ అధ్యక్షుడు పొడిచేటి రామచంద్ర చార్యులు, సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి పాండు, సుబ్బారావు, పోడిచేటి జగన్నాథ చార్యులు, సీతరామానుజాచార్యులు, సీతారామ చార్యులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆకోజు సునీల్ కుమార్, ఎంబీ నర్సారెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు గుంజా చెన్నకేశవ, కాపుల రవి, జక్కుల కృష్ణార్జునరావు, పోలిశెట్టి శ్రీనివాస్, రాయల రాము పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పది నెలలుగా కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.గౌస్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల హర్షం

బూర్గంపాడు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నియమించటం పట్ల ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలను పార్టీ శ్రేణులు స్వాగతించాలని కోరారు. కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌ల కలయికలో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

గిరిజనులకు 'దారి' చూపేదెవరు?

- గుంతలమయంగా మొండికుంట–తుమ్మలచెరువు రోడ్డు
- వర్షపునీరు నిండడంతో ప్రమాదకరంగా మారిన వైనం
- 20 గ్రామాల ప్రజలకు ఏళ్లుగా సమస్య..
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



అస్తవ్యస్తంగా మారిన మొండికుంట–తుమ్మలచెరువు రహదారి

అశ్వాపురం: మొండికుంట–తుమ్మలచెరువు రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని మొండికుంట నుంచి తుమ్మలచెరువు, గొందిగూడెం గ్రామాల మీదుగా అశ్వాపురం వచ్చే రహదారి అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ప్రజలు ప్రయాణించే ఈ రహదారి సమస్యల మూలంగా నరకయాతన అనుభవిస్తున్నారు.

మొండికుంట–తుమ్మలచెరువు రహదారిపై మొండికుంట, కుర్వాపల్లి కొత్తూరు, తుమ్మలచెరువు, బండ్లవారిగుంపు, రామవరం, భీమవరం, గొందిగూడెం, అశ్వాపురం వరకు నిత్యం మొండికుంట, అశ్వాపురం గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. దాదాపు 20 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. తుమ్మలచెరువు, వెంకటాపురం, మారుమూల గిరిజన గ్రామమైన మామిళ్లవాయి వరకు గిరిజనులు ప్రతి అవసరానికీ మొండికుంట గ్రామానికి వస్తుంటారు. గొందిగూడెంతో పాటు మారుమూల గ్రామాలైన గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల గ్రామాల గిరిజనులు తమ అవసరాలకు నిత్యం అశ్వాపురం మండల కేంద్రానికి వస్తుంటారు. అయితే ఈ రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉంది. ఆ గుంతలు ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు నిలువడంతో ప్రయాణికులు వాటిని కానని పరిస్థితి నెలకొంది. వెరసి దీనిపై ప్రయాణాలు చేస్తున్న 20 గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గిరిజనులు అనారోగ్యాల పాలైతే అత్యవసర వైద్య సేవలకు మండల కేంద్రానికి చేరుకోవాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం రహదారి మరమ్మతులు కూడా చేయించడం లేదని స్థాని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులైనా చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులకు తీవ్ర ఇబ్బందులు..



గొందిగూడెం–అశ్వాపురం రహదారి అధ్వానంగా ఉండి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి అవసరాకీ మండల కేంద్రానికి వెళ్తుంటాం. కానీ రహదారి సమస్యతో అవస్థలు పడుతున్నాం. రహదారి నిర్మించాలని అధికారులను ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం. ఇప్పటికైనా నిర్మించాలి.

– బండ్ల మునీశ్వరరావు, గొందిగూడెం

రహదారి నిర్మించాలి..



రహదారి గుంతలమయమై అస్తవ్యస్తంగా ఉంది. దీనిపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేయించడానికి కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– వంకా సత్యనారాయణ, తుమ్మలచెరువు

కాల్వల మరమ్మతులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన కుడి, ఎడమ కాల్వలు, వాటి డిస్ట్రిబ్యూటరీలపై కొనసాగుతున్న మరమ్మతు పనులను మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ కె.వెంకటేశ్వరరెడ్డి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి సాగునీటి విడుదలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట ప్రాజెక్ట్ డీఈ తిరుపతి, ఏఈ ఉపేందర్, సిబ్బంది ఉన్నారు.

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రతీ ఇంట్లో దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ తాటి సావిత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు రాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాజుపేట, బాపనకుంట, పగిడేరు పల్లె దవాఖానాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. టీహబ్ ద్వారా చేస్తున్న 134 పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుజాత, కౌసల్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

కరకగూడెం: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్రాంత తహసీల్దార్, వేదాంతం ట్రస్ట్ అధ్యక్షుడు వై.రాఘవచార్యులు, అనంతారం హెచ్ఎం ఎం.రాజా ఆకాంక్షించారు. ఈ మేరకు వారు మంగళవారం మండలంలోని పద్మాపురం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు వేదాంతం ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 6 వేల రూపాయలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతరత్రా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం రాజా మాట్లాడుతూ.. వేదాంతం ట్రస్ట్ సేవలు అభినందనీయమని పేద విద్యార్థులకు ఏదో రూపంలో సాయపడడం సంతోషకరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాదచార్యులు, ఉపాధ్యాయురాలు శకుంతల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ మహిళలు, యువతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్లబ్ సభ్యులు గాజుల రమేష్ సౌజన్యంతో కుట్టుమిషన్‌ను టైలరింగ్ శిక్షకురాలు సౌజన్యకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు షేక్ మీరాహుస్సేన్, అడబాల నాగేశ్వరరావు, నాగేష్, శ్రీనివాసరావు, భూక్యా ప్రసాద్, తార, వెంకట్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలో కుండపోత వర్షం పడటంతో భారీ వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం మండల వ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి చిన్న కుంటలు, చెరువులు నీటితో నిండుకుని జలకళను సంతరించుకున్నాయి. గత నెల రోజుల నుంచి సకాలంలో వర్షాలు పడక ఇబ్బంది రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం భారీ వర్షం కురిసేసరికి ఒక్కసారిగా ఆనందం వ్యక్తం చేశారు. వరి నారు, పత్తి విత్తనాలు విత్తిన రైతుల మొహంలో సంతోషం వెల్లివిరిసింది.

రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోత్రధారణ చేసి నిత్యకల్యాణ ఘట్టాన్ని జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. ఆల్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం ఎస్టీఓ కార్యాలయం ఎదుట నల్లబాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్టీఓ సుభద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ప్రసాద్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, మంగయ్య, హరినాథ్, కిషన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనులు పరిశీలన

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆశ్రమ ఆదర్శ కళాశాల నిర్మాణ పనులను మంగళవారం జెడ్పీటీసీ పోశం నరసింహారావు పరిశీలించారు. వంటశాల, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు ఆర్.వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జావిద్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు బొలిశెట్టి నవీన్, కంభంపాటి శ్రీనివాసరావు, తాతా రమణ పాల్గొన్నారు.

సూర్యవతి వర్ధంతి సభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మానుకొండ సూర్యవతి 30వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. పట్టణ కమిటీ సభ్యురాలు పి.లక్ష్మీకాంత అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా సూర్యవతి చిత్రపటానికి జిల్లా ఉపాధ్యక్షురాలు నాదేళ్ల లీలావతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి మాట్లాడుతూ.. మానుకొండ సూర్యవతి మహిళా లోకానికి అనేక సేవలు అందించారని కొనియాడారు. మహిళా సంఘానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యురాలు కె.రమణ, డి.నాగలక్ష్మి, పి.రాధ, పి.ఇంద్రజ, ఎం.శాంతి, డి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలోని కే రేగుబల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు దుమ్ముగూడెం డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమయా పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి కూడా పాజిటివ్ రాలేదు. సికిల్‌సెల్ ఎనీమియా వంశపారపర్యంగా జన్యూలోపం వల్ల వస్తుందని, దీనిని ముందే గుర్తించి డాక్టర్‌లను సంప్రదిస్తే వ్యాధిని నివారించవచ్చని డాక్టర్ పుల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం ధనసరి నాగమణి, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న మోహన్ (52)సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. పట్టణంలోని అయప్పకాలనీకి చెందిన మోహన్ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కొన్నేళ్లుగా హోంగార్డుగాగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మోహన్ మృతికి జిల్లా పోలీస్ శాఖ, హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు, భద్రాచలం టౌన్ పోలీసులు, శ్రీసీతారామచంద్ర స్వామి ఎస్‌పీఎఫ్ సిబ్బంది సంతాపం ప్రకటించారు. కాగా, మోహన్ కుటుంబానికి జిల్లా హోంగార్డ్స్ ఆఫీస్ సభ్యులు రూ.10 వేలు, భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి రూ.5 వేలు, దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది రూ.8,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ శ్రీనివాసరావు, భద్రాచలం యూనిట్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, సీఐ నాగరాజు, ఎస్ఐలు మధుప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో వ్యక్తి..

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తుండగా, అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నెమలిపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. మంగళవారం మండలంలోని లింగాలపల్లి గ్రామానికి చెందిన సరియం వసంతరావు(45), మరి కొంతమందితో కలసి నెమలిపేట గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ఇనుప కంచె వేసే పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్ర సమయంలో గుండెలో నొప్పిగా ఉందని వసంతరావు తెలపగా, తోటి పనివారు అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

దాడి ఘటనపై కేసు నమోదు


భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడిచేసిన ఘటనపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ఉదయ్ అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి మద్యం తాగి ఉన్నాడు. ఆ మత్తులో అర్ధరాత్రి అదే కాలనీకి చెందిన రామకిషోర్ ఇంటి తలుపు కొట్టి పారిపోయాడు. ఇదే సమయంలో రామకిషోర్ డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఆపై రామకిషోర్, తన మిత్రులతో కలిసి ఉదయ్‌ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఉదయ్ కనిపించాడు. ఈ క్రమంలో ఉదయ్‌పై రామకిషోర్ దాడి చేశారు. తిరగబడ్డ ఉదయ్ అక్కడే ఉన్న కర్రతో రామకిషోర్, అతని తల్లిపై దాడి చేశాడు. రామకిషోర్ కంటితో పాటు అతని తలపై బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. రామకిషోర్ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

ప్రముఖుల జయంతి వేడుకలు


మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, ఉమ్మడి ఏపీ దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, దివంగత రాజకీయ నాయకుడు వంగవీటి రంగాల జయంతులను మంగళవారం నిర్వహించారు. క్షత్రియ సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి, ఆర్యవైశ్య మహాసభ, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో రోశయ్య, మున్నూరుకాపుల ఆధ్వర్యంలో రంగాల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



చర్ల: అల్లూరి విగ్రహం వద్ద నివాళి..



భద్రాచలంఅర్బన్: రోశయ్య చిత్రపటం వద్ద..



మణుగూరురూరల్: రంగా చిత్రపటం వద్ద..

మాట నిలబెట్టుకున్న కేసీఆర్

- ఏళ్లనాటి కల సాకారమైంది..
- పోడు పట్టాల పంపిణీలో ప్రజాప్రతినిధులు



గుండాల: పోడు భూముల హక్కు పత్రాలు అందిస్తున్న రేగా కాంతారావు



ములకలపల్లి: పట్టా పాస్‌బుక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్ నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న ప్రధానంగా ఉన్న పోడు భూముల సమస్యపై నాడు ముఖ్యమంత్రి మాట ఇచ్చారని.. నేడు పోడు భూములకు పట్టాలు ఇచ్చి మాట నిలబెటుకున్నాడని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో గిరిజనులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎన్నికల సమయంలో పోడు భూముల సమస్యనే ఎజెండాగా కాంగ్రెస్ తరుపున గెలిచానని, తిరిగి పోడు భూముల పట్టాల సాధన కోసమే బీఆర్ఎస్‌లో అడుగు పెట్టానని తెలిపారు. పోడు సాగుదారులు, ఆటవీఅధికారుల మధ్య ఘర్షణలను తెరదించేందుకు తాను కేసీఆర్‌తో ఎన్నోమార్లు చర్చలు జరిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆళ్లపల్లి మండలంలో 1,082 మందికి 13,938 ఎకరాలకు, గుండాల మండలంలో 4,322 మంది లబ్ధిదారులకు 18,604 ఎకరాలకు హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు ముక్తి సత్యం, కొండ్రు మంజు భార్గవి, వాగబోయిన రామక్క, కొమరం హన్మంతు, వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తహసీల్దార్‌లు సాదియా సుల్తానా, నాగదివ్య, ఎంపీడీఓలు రామారావు, సత్యనారాయణ, ఎంపీఓ వలీ, సీఐ రవీందర్, ఎస్సైలు రాజశేఖర్, రతీష్, బీఆర్ఎస్ మండల నాయకులు తెల్లం భాస్కర్, అజ్జు, వీరస్వామి, పాయం నర్సింహరావు, అతహార్, ఖయ్యూం, బాబా తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: పోడు భూముల పట్టాలు పొందడంతో సాగుదారుల చిరకాల స్వప్నం సాకారమైందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని రాచన్నగూడెం, ముత్యాలంపాడు, సీతాయిగూడెం, జగన్నాథపురం, కొత్తగంగారం జీపీల్లోని 1,095 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆయన పోడు పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయా జీపీకేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మట్లాడారు. సభల్లో ఎమ్మెల్యే స్థానిక కోయ భాషలో మాట్లాడుతూ.. లబ్ధిదారులలో ఉత్సాహాన్ని నింపారు. ఆయా జీపీల సర్పంచ్‌లు కొర్సా గణపతి, నాగమణి, కారం సుధీర్, గడ్డం భవాని, వాడే లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీను, ఈఓఆర్డీ లక్ష్మయ్య, ఎంపీపీ మట్ల నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, ఎంపీటీసీలు మడకం విజయ, నూపా సరోజిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దమ్మపేట: పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పోడు పట్టాలను పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని అంకంపాలెం, జగ్గారం గ్రామాలలో ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే పోడు పట్టాదారు పుస్తకాలను, లబ్ధిదారులకు అందజేశారు. మండల పరిధిలోని అంకంపాలెం, ఆర్లపెంట, పూసుకుంట, జగ్గారం, బాలరాజుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని 459 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అనంతరం జగ్గారంలో ఓ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, తహసీల్దార్ స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్‌లు కాకా అనూష, ఊకే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, ఎంపీపీ, జెడ్పీటీసీ

దుమ్ముగూడెం: భద్రాచలం శాసనసభ్యుడు పొదెం వీరయ్య మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పోడు సాగుదారులకు పట్టాలను పంపిణీ చేశారు. మండలంలోని నర్సాపురం, నడికుడి, ఆర్లగూడెం, పెదకమలాపురం, కొత్తూరు, దబ్బనూతుల, అంజుబాక, చిన్ననల్లబల్లి, చింతగుప్ప, గౌరారం, పర్ణశాల గ్రామంలో అర్హులైన పోడు సాగుదారుకు పట్టాల పంపిణీ చేశారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.